దోపిడీని ఎదురించిన వీరవనిత ఐలమ్మ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: భూస్వాములు, పెత్తందారుల దోపిడీని ఎదురించి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరవనిత ఐలమ్మ అని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఐలమ్మ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ్‌ముఖ్‌లు, నిజాం నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన ఆమెను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, రజక సంఘాల నాయకులు నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నరసింహస్వామి, ప్రణాళిక సంఘం అధ్యక్షుడు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, జిల్లా ఉద్యానశాఖాధికారి మరియన్న, సీపీఓ ఫ్లోరెండర్ ఉదయ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్, రజక సంఘాల నాయకులు మాద్దు ఉప్పలయ్య, దుగ్గి గోపాల్, మామిడాల సత్యనారాయణ, శాగంటి కిషన్, కె.వెంకన్న పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్




కలెక్టరేట్‌లో చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో

నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

- పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్



ఈనాడు మీతోడు

పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోతుండటం ప్రకృతి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థుల సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుంటామని ప్రతినబూనారు.



ప్రకృతిహితం

ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

- **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా వెళ్లి చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.
- **పాల్గొన్న వారు:** ట్రైసిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలా వరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది
- **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి



అవగాహన

ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ • కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన • జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి.దేవేందర్ • భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)



శ్రమదానం

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా • కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం • హరితా సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ • శ్రమదానం చేద్దాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..– కాళేశ్వరం



చైతన్యం



శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాబాద్ జిల్లా • ఆలయ విశిష్ఠతపై ఇంటర్మీడియట్ విద్యార్థినులకు అవగాహన • ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.శేఖర్, ఎస్సై మాలోతు సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీవో యాకయ్య • ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)



స్వచ్ఛత


పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా • పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు • గ్రామస్థులు, యువకులు • పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ



బాధ్యత

రామప్ప ములుగు జిల్లా • ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు • పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు • రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత

– వెంకటాపూర్



పరిశుభ్రత

బొగత జలపాతం ములుగు జిల్లా • పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు • అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది • స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు



ప్లాస్టిక్‌పై యుద్ధం

లక్నవరం జలాశయం, ములుగు జిల్లా • ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ • బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది • పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

'యువతను మోసగిస్తున్నారు'

కురవి, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం హామీలతో యువతను మభ్యపెడుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. కురవి మండలం రాజోలులో గురువారం నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. భాజపా అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, మండల కార్యదర్శి కొటయ్య, మల్లూర్, పిట్టల వెంకన్న, వెంకన్న, సుదాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

వేలంతో రూ.2 లక్షల ఆదాయం

గూడూరు, న్యూస్‌టుడే: వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.2లక్షల ఆదాయం లభించిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ తెలిపారు. మండలంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కిరణ్ మాట్లాడుతూ.. వేలంలో 19 వాహనాలు అమ్ముడయ్యాయన్నారు. మొత్తంగా రూ.2,00,768 ఆదాయం ప్రభుత్వానికి లభించిందన్నారు.

ప్రిన్సిపల్ బదిలీ

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు ఒకేషనల్) ప్రిన్సిపల్ రాజసుధను బదిలీ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు గురువారం ఉత్తర్వులు వెలువరించారు. కళాశాల ప్రిన్సిపల్ తమ పట్ల అనుచిత భాష ఉపయోగిస్తున్నారని విద్యార్థినులు మంగళవారం ఆందోళన చేశారు. అదే రోజు రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్ రమేష్ కళాశాలకు వచ్చి విచారణ జరిపారు. విద్యార్థినులు తమ గోడును బహిరంగంగా వినిపించారు. మరుసటి రోజు శాఖాపరంగా ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు చేపట్టింది. కళాశాల అధ్యాపకులు స్వప్నకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు అప్పగించినట్లు ఆర్ఎల్‌సీ రమేష్ ధ్రువీకరించారు.

చదువులో రాణిస్తే ఉన్నత భవిత



పాఠశాలలోని వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి సరిత

తొర్రూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకునే సమయంలో కష్టపడేతత్వాన్ని అలపరుచుకుని చదువులో రాణించి ఉన్నతమైన భవిష్యత్తును రూపొందించుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి, ఛైర్మన్ మండల న్యాయసేవాసంస్థ మట్ట సరిత తెలిపారు. డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహం, వంటగదులను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ సమయం వృథా చేయకుండా తమ దృష్టిని చదువుపైనే కేంద్రీకరించాలన్నారు. ప్రత్యేకాధికారిణి శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిత

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి సైదానాయక్ అన్నారు. మండలంలోని రెడ్యాల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ ఏటీడీవో పరిధిలో 360 మంది గిరిజన బాల, బాలికలు పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి పాఠశాల పీడీ మోహన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో రఘుపతిరెడ్డి, ఏటీడీఓ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సక్రు, పీజీహెచ్‌ఎం కోటేశ్వరీ, వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ సైదానాయక్

రాజీ పడదాం.. ప్రశాంతంగా జీవిద్దాం..!

- రేపు జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: క్షణికావేశాలతో నేరాలకు పాల్పడి కేసులపాలైన వారు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి చక్కని మార్గాన్ని లోక్ అదాలత్‌లతో ఉన్నత న్యాయస్థానం కల్పిస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా పలు కేసులు పరిష్కారమవుతున్నాయి. తెలిసీ తెలియక చిన్న చిన్న విభేదాల వల్ల కొందరు దంపతులు, సోదరుల మధ్య, ఇరుగు పొరుగువారితో వివాదాలు చోటు చేసుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. ఆస్తుల పంపకాల్లో కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు ఏర్పడి కేసుల పాలై తమ జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారు. ఈక్రమంలో లోక్ అదాలత్‌లు వారికి ఆశాజనకంగా మారాయి. రాజీపడదగిన కేసులు వీటి ద్వారా పరిష్కరించుకోవచ్చు. శనివారం మహబూబాబాద్, తొర్రూరు న్యాయస్థానాల ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నారు.

అవగాహన కల్పిస్తూ..: రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునే విధంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. కక్షిదారులకు, ఫిర్యాదుదారులకు కేసులు పరిష్కరించుకునే విషయంలో అవగాహన కల్పిస్తారు. ఇరు వర్గాల వారిని పిలిపించి రాజీ కుదుర్చుకునేలా కోర్టు లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ఈ ఏడాది లోక్‌అదాలత్‌ల్లో ఇలా

మహబూబాబాద్ జిల్లా కోర్టులో..: ఈ ఏడాది మార్చి 16న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3,321 పెండింగ్ కేసులు, పీఎల్‌సీ కేసులు 58,414 పరిష్కారమయ్యాయి. జూన్ 8న 2,481 పెండింగ్ కేసులు, పీఎల్‌సీ కేసులు 19 పరిష్కారమయ్యాయి

తొర్రూరు కోర్టులో..: మార్చి 16న తొర్రూరు కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 444, జూన్ 8వ తేదీన 1289 కేసులు పరిష్కారమయ్యాయి.

సద్వినియోగం చేసుకోవాలి

- సి.సురేష్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి



రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ కల్పిస్తుంది. చిన్న చిన్న ఘర్షణల కారణంగా సంవత్సరాల కొద్దీ పోలీస్ స్టేషన్ల, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోవడం, ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుంది. దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక. ప్రజలు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని ప్రశాంత జీవితాన్ని గడపాలి.

కేసుల పరిష్కారానికి మంచి అవకాశం

- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ, మహబూబాబాద్



కేసులు పరిష్కరించుకోవాడానికి జాతీయ లోక్‌అదాలత్ మంచి అవకాశం. సామరస్యధోరణితో ఇరు వర్గాల ప్రజలు రాజీకి వచ్చి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలి.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాల వెల్లువ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఇటీవల విడుదల చేసిన గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాలో తప్పులు చోటు చేసుకున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాకపోవడం, మరికొన్ని వార్డుల్లో ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఇతర వార్డుల పరిధిలోకి వెళ్లాయి. కొన్ని చోట్ల భర్తకు ఒక వార్డు, భార్యకు మరో వార్డులో ఓట్లు వీటిని మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 14 నుంచి 21 వరకు ఓటర్ల జాబితాలో ఓటర్ల నమోదు తప్పులపై అభ్యంతరాలను స్వీకరించారు. ఆ ఫిర్యాదులను జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించి సవరణ చేయాల్సిందిగా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 978 అభ్యంతరాలు రాగా బుధవారం వరకు 956 ఫిర్యాదులను పరిష్కరించారు. గురువారంతో సవరణల గడువు తీరనుంది. 28న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నారు.



గూడూరు మండలం సీతానాగారం పంచాయతీలో ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

బీఎల్‌వోలదే బాధ్యత

ఓటర్ల జాబితా రూపకల్పనలో క్షేత్రస్థాయిలో బీఎల్‌వోదే కీలక బాధ్యత. ఇంటింటికి వెళ్లి సమగ్రంగా విచారించి ఓటర్లను నమోదు చేయాలి. ఆ సమయంలో మృతి చెందినవారి పేర్లను తొలగించడం, ఇతర వార్డుల్లోకి ఓట్లు వెళ్లకుండా పరిశీలించి జాబితాను రూపొందించాలి. ప్రస్తుతం సవరించిన జాబితాను సమగ్రంగా పరిశీలించిన తర్వాతనే ముద్రణకు పంపిస్తే తుది జాబితాలో పొరపాట్లు జరగకుండా ఉంటాయి. ఒక్కరోజే సవరణకు గడువు ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

☛ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాలో జరిగిన తప్పులపై వస్తున్న ఫిర్యాదులను విచారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఫిర్యాదులపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తూ మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. తప్పులు లేకుండా తుది జాబితాను విడుదల చేస్తామన్నారు.

మండలాలవారీగా..

మండలం	అభ్యంతరాలు	పరిష్కారం
బయ్యారం	297	297
చిన్నగూడూరు	32	26
దంతాలపల్లి	10	10
డోర్నకల్	19	19
గంగారం	69	69
గార్ల	25	25
గూడూరు	36	36
కేసముద్రం	113	113
కొత్తగూడ	20	20
కురవి	34	34
మహబూబాబాద్	90	90
మరిపెడ	89	80
నర్సింహులపేట	24	24
నెల్లికుదురు	32	25
పెద్దవంగర	31	31
తొర్రూరు	57	57

● మండలం ● అభ్యంతరాలు ● పరిష్కారం

పంచాయతీలు : 473
వార్డులు : 4,052
ఓటర్లు : 5,51,858

భూమికి పచ్చని రంగేసినట్లు..!



నెల రోజుల కిందట నాటు వేసిన వరి పెరిగి భూమికి పచ్చని రంగేసినట్లుగా అందాలతో కనువిందు కలిగిస్తోంది. నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామ శివారులో ఈ మనోహర దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

చెరువులోనే భవనం..! వివరాలు 8లో..

పాత పింఛను విధానం అమలు చేయాలి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానం కొనసాగిస్తూ ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతుందని, వెంటనే పాత విధానం అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి డిమాండ్ చేశారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పెన్షన్ ఆక్రోష్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు లింగారెడ్డి, లక్ష్మీకాంత్, నాగరాజు, రఫిక్, రవీందర్, మమత, భద్రునాయక్, ఓంకార్, శ్రీను తదితరులున్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చెరువులోనే భవనం..!

● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే భవనం నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల తాగునీటికి ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఒక భవనాన్ని కట్టేశారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగల భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్టు సమాచారం. మరో విడ్డూరం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించి, ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇస్తే నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 1251లో ఇంటి నిర్మాణం జరుగుతుండగా తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారన్నారని.. దీనిపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజిపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి 'రేడియో కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్'లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిని సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణలపై చర్చించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్తున్న రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాదయాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. –ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకునేవారు, ఫేస్‌బుక్‌లలో పోస్టులు చేసేవారు బోలెడు మంది. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజీపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి ఉత్సవ నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి వృక్షాల హననాన్ని ఆపాలని ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇవ్వడంలో ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డేపల్లి చెరువు వద్ద సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డేపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్క్‌గా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.


ఎస్పీ కార్యాలయంలో


మహబూబాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో


నర్సింహులపేటలో


నెల్లికుదురులో

చాకలి ఐలమ్మకు నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లాలో పలు చోట్ల నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని అన్యాయాలు, అక్రమాలపై ఎదురొడ్డి ఆమె చూపిన పోరాట పటిమ, తెగువను వక్తలు కొనియాడారు. అధికారులు, స్థానిక నేతలు, రజక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే బృందం


ఐలమ్మ చిత్రపటం వద్ద జేపీఆర్ హెచ్ఆర్ఎస్ అధిపతి నాగరాజు, ఉద్యోగుల నివాళులు


తొర్రూరులో


చిన్నగూడూరులో


చిన్నముప్పారం గ్రామంలో


దంతాలపల్లిలో


గార్లలో..


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో


పెద్దవంగరలో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని శాంతినగర్ రోడ్డు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. - ఆనంద్
శుభ్రం చేయిస్తాం. - అహ్మద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డోర్నకల్

డోర్నకల్: తోడేళ్లగూడెం గ్రామ కూడలిలో వీధి దీపం వెలగడం లేదు. - రమేష్
మరమ్మతులు చేయిస్తాం. - సాయితేజ, పంచాయతీ కార్యదర్శి, తోడేళ్లగూడెం

మహబూబాబాద్ టౌన్: ఇందిరాగాంధీ కూడలి ఆవరణలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. - శేఖర్
సమాధానం: వీధి కుక్కలను నిర్ణీత ప్రదేశానికి తరలించే చర్యలు తీసుకుంటాం. - తోట రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

లీకేజీకి మరమ్మతు

స్పందనకు వందనం

మహబూబాబాద్ టౌన్: కాకతీయనగర్‌కాలనీ వీధిలో పైపులైను లీకేజీతో నీరు వృథాగా పోతుందని శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు 26వ వార్డు కౌన్సిలర్ డోలారాప్ స్వాతి స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో మరమ్మతు చేయించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఇనుగుర్తిలో నిర్వహించిన సామూహిక సీమంతంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు

దంతాలపల్లి, చిన్నగూడూరు, నెల్లికుదురు, ఇనుగుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. దంతాలపల్లిలో మండల పెద్దముప్పారంలో నోడల్ అధికారి శ్రీదేవి, పల్లె దవాఖాన వైద్యురాలు వాణి సూపర్‌వైజర్ సుధ పాల్గొన్నారు. చిన్నగూడూరులో మరిపెడ ప్రాజెక్ట్ అధికారి ఎల్లమ్మ, తహసీల్దారు మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. నర్సింహులగూడెం పంచాయతీ ఆవరణలో గురువారం పోషణ మాసోత్సవంలో ఐసీడీఎస్ వావిలాల సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, పల్లె దవాఖాన వైద్యురాలు త్రివేణి తదితరులున్నారు. ఇనుగుర్తి రైతు వేదికలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ, సీడీపీఓ శిరీష, కేసముద్రం ఎంపీడీవో ఉదయశ్రీ, మండల వైద్యాధికారి సురేష్ గర్భిణులకు సీమంతం నిర్వహించారు,

తెరుచుకొన్న అంగన్‌వాడీ కేంద్రం

పెద్దవంగర, న్యూస్‌టుడే: పెద్దవంగరలో ఉన్న మొదటి అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు సరిగాలేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల కిందట టీచర్‌కు సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించడంతో అప్పటి నుంచి ఆయా ఒక్కరే కేంద్ర నిర్వహణ చూస్తున్నారు. అయిదు నెలల కింద ఆయా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కేంద్రాన్ని పట్టించుకునేవారే కరవయ్యారు. ఈ నేపథ్యంలో 'ఐదు నెలలుగా పట్టించుకోని అంగన్‌వాడీ కేంద్రం' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ సీడీపీవో ఇందిర స్పందించారు. గురువారం కేంద్రాన్ని సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం రోజూ తెరిచే ఉంటుందని, ఆయా అందుబాటులో ఉంటుందన్నారు. మూడో కేంద్రం టీచర్ రేణుక రోజు తప్పించి రోజు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు.


అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీడీపీవో ఇందిర

ఈనాడు కథనానికి స్పందన

ఇదే మా భవిష్యత్తు ఆశయం..!


వివిధ రకాల వృత్తులను ప్రతిబింబించే వేషధారణతో పాఠశాలకు హాజరైన విద్యార్థులు

నేను పెద్దయ్యాక డాక్టర్ అవుతా...లాయర్.....ఇంజినీర్ అవుతా అని విద్యార్థులు చెప్పడం వింటాం. తమ భవిష్యత్తు ఆశయాన్ని ముందే ప్రదర్శించి తమ ఆకాంక్షను చాటుకుంటున్నారు ఈ విద్యార్థులు. తొర్రూరులోని అభ్యాస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇలా తమ ఆకాంక్షను వ్యక్తంచేసే దుస్తులతో గురువారం పాఠశాలకు హాజరై సందడి చేశారు. విద్యార్థుల ఆకాంక్ష నిజంకావాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆశీర్వదించారు. – న్యూస్‌టుడే, తొర్రూరు

వాగులో పడిన ఆటో

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ సమీపంలోని గాదెవాగులో గురువారం ప్రమాదవశాత్తు ఆటో పడి పోయింది. నర్సంపేట నుంచి కొత్తగూడకు ఓ ఇనుప దుకాణానికి ఇనుప సువ్వలను ఆటోలో తీసుకెళ్తున్నారు. కొత్తగూడలో కురిసిన భారీ వర్షం కారణంగా గాదెవాగు ఉప్పొంగుతోంది. గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తు గుంతలోకి జారి బోల్తా కొట్టినట్లు చెప్పారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడగా వాహనం దెబ్బతింది. వాగువద్ద వంతెన నిర్మించి గుంతలను పూడ్చివేయాలని పలువురు వాహనదారులు, ప్రయాణికులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కేసముద్రం, న్యూస్‌టుడే: పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి అన్నారు. అమీనాపురం గ్రామంలో గురువారం ఆయన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఒక వర్షానికే పగుళ్లు!



రూ.లక్షలు వెచ్చించిన మట్టి రోడ్డు ఒక్క వర్షానికే కుంగి పగుళ్లు పట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద నీటి ధాటికి కురవిలోని పెద్ద చెరువు కట్టకు వెళ్లేందుకు పైపులు వేసి గతంలో నిర్మించిన మట్టి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో అదనంగా పైపులు వేసి అక్కడ తాత్కాలికంగా మట్టితో కట్టను నిర్మించారు. రోలింగ్ చేయకుండా వదిలేయడంతో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో పోసిన మట్టి రెండు వైపులా కిందకు కుంగి కట్టపై పగుళ్లు పట్టి కనిపిస్తున్నాయి. మరో వర్షం వస్తే పూర్తిగా మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు పరిశీలించి వంతెన నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కురవి (మహబూబాబాద్)

దీర్ఘకాలిక బిల్లు బకాయిలు చెల్లించాలి


మరిపెడలో

మరిపెడ, న్యూస్‌టుడే: కొన్ని నెలలుగా ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎల్లంపేట పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఐదు డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులున్నారు.

నమూనా ఎన్నికలు



మహబూబాబాద్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నమూనా ఎన్నికల కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారిగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉపాధ్యాయురాలు కె.గిరిజ వ్యవహరించారు. పాఠశాల స్థాయిలోనే ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

– న్యూస్‌టుడే, నెహ్రూసెంటర్

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. లక్ష విరాళం



నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం బంగారు దుకాణ యజమానులు రూ. ఒక లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు అందజేశారు. వీటితో పాటు మరో రూ.50 వేలను త్వరలో ఇవ్వనున్నట్లు వ్యాపారులు తెలిపారు. అట్టి డబ్బులను సీసీ టెక్నిషియన్‌కు అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు పి.దేవేందర్, సర్వయ్య, వెండి బంగారు దుకాణ యజమానులు సనాతనాచారి, రవి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఎండు తెగులు

చిన్నగూడూరు: మండలం కేంద్రంలో వరదకు గురైన వరి పంటను ఏవో భాస్కర్ గురువారం పరిశీలించారు. వరిలో బ్యాక్టీరియా, ఎండు తెగులు కనిపించిందన్నారు. నివారణకు సూచనలు చేశారు.

నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు

కురవి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కురవిలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిల్వ వివరాలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు.

భూమి పూజ

నర్సింహులపేట, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగను పురస్కరించుకొని నర్సింహులపేటలోని గంగాయికుంట కట్టపై బతుకమ్మ విగ్రహం ఏర్పాటుకు బుధవారం బతుకమ్మ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కిసాన్ పరివార్ అధినేత నానావత్ భూపాల్‌నాయక్ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కిసాన్ పరివార్ నర్సింహులపేట మండల ఇన్‌ఛార్జి చెలిమిల్ల గణేష్ భూమి పూజ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కారోబార్ రమేష్, బతుకమ్మ కమిటీ సభ్యులు ఆకుతోట నరేష్, కల్లెడ అభినయ్, సుంకరి చంద్రయ్య, హోంజీ, రాములు, పలువురు పాల్గొన్నారు.

భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ చెప్పారు. దంతాలపల్లిలో భాజపా ఆన్‌లైన్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నియోజకవర్గ కన్వీనర్ పూర్ణచందర్, మండల ప్రధాన కార్యదర్శి మురళి, మండల కోశాధికారి ప్రవీణ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్‌టీయూ టీఎస్‌తోనే పరిష్కారం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ తోనే సాధ్యమని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. నర్సింహులపేట మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఇటీవల మృతి చెందిన ఆ సంఘం నాయకులకు నివాళులర్పించి అనంతరం ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ అనుబంధ రేషన్‌లైజేషన్ జీవో 25ను సవరించాలన్నారు. పెద్దనాగారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జానకీ సుమన, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర పూర్ణచందర్, కొండా సంజీవ్‌యాదవ్, జిల్లా, రాష్ట్ర బాధ్యులున్నారు.

వరద బాధితులకు సహాయం

నెల్లికుదురు: మండలంలోని రావిరాల వరద బాధిత కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ఆర్.ఎం.పి, పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ గార్ల, నెల్లికుదురు మండలాల ప్రతినిధులు వంటసామగ్రిని అందజేశారు. 65 కుటుంబాలకు గార్ల, నెల్లికుదురు మండల కమిటీల ప్రతినిధులు, జిల్లా అధ్యక్షుడు రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి కళాధర్‌రాజు పంపిణీ చేశారు. గార్ల మండల అధ్యక్షుడు శేషగిరి, ప్రధాన క్యాదర్శి కొండల్‌రావు, నెల్లికుదురు మండల అధ్యక్షుడు జహుర్‌పాషా తదితరులున్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

మరిపెడ, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేపట్టొద్దని మరిపెడ పట్టణం బ్యాంక్‌కాలనీవాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీలో ఓ సంస్థ నూతనంగా ప్రారంభించిన సెల్ టవర్ ఏర్పాటు పనులను కాలనీవాసులు సామూహికంగా అడ్డుకున్నారు. సదరు టెలికాం సంస్థ రెండు రోజుల కిందట టవర్ ఏర్పాటుకు పనులు ప్రారంభించేందుకు యత్నించగా పుర అధికారులు అడ్డుకున్నారని, తిరిగి గురువారం సదరు సంస్థ పనులు ప్రారంభించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు పనులు నిలిపి వేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

గోడ పత్రికలు ఆవిష్కరణ

నెల్లికుదురు, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోరుతూ ఈ నెల 30న హైదరాబాద్ నిర్వహించే మహా ధర్నా గోడపత్రికలను ఉభయ ఐఎఫ్‌టీయూ సంఘాల నేతలు గురువారం ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఎం.ఉపేందర్, వెంకన్న, విజయ్, యాకయ్య, యాదగిరి, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ తహసీల్దార్ కార్యాలయంలోకి గురువారం పాము చొరబడి కలకలం సృష్టించింది. గురువారం ఉదయాన్నే కార్యాలయం తెరుచుకోగానే సిబ్బందికి పాము కనిపించినట్లు చెప్పారు. సిబ్బంది కర్రతోకొట్టి చంపారు. కార్యా పక్కనేఉన్న వసతిగృహ శిథిలావస్థ భవనాల నుంచి పాములు కార్యాలయంలోకి వస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి

కొత్తగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలను ఇవ్వాలని కోరుతూ గురువారం కొత్తగూడ తహసీల్దార్ రమాదేవికి ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఉద్యమకారులను ఆదుకుంటామని చెప్పిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. రవి, మధు, నవీన్, జీవన్, నర్సింగరావు, లక్ష్మీనారాయణ, మురళి, రూప్లా, తదితరులు వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం మేడ శివప్రసాద్ గురువారం పేర్కొన్నారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కొనసాగే కార్యక్రమంలో 8500324880 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

గాంధీజీ సాహిత్యం పంపిణీ

మానుకోట, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ 155 జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ గాంధీ స్మారక నిధికి చెందిన గాంధీ సాహిత్య ప్రచురణాలయం పంపించిన గాంధీ సాహిత్య పుస్తకాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, గ్రంథాలయాలకు, విద్యార్థులకు, వివిధ రంగాల్లోని ప్రముఖులకు పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర ప్రతినిధి సింగు రమేశ్ గురువారం తెలిపారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు డీవీ సుబ్బారావు, కార్యదర్శి కోదాటి రంగారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకాలు కావాల్సిన వారు తమను సంప్రదించాలన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


నగదును అందిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, న్యూస్‌టుడే: మోద్గుల గూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మృతి చెందిన అంటెండర్ గౌసిద్దీన్ కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయులు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం పాఠశాలలో ఆయన కుమార్తెకు నగదును అందించారు. కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ శివకుమార్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, వెంకన్న, శ్రీనివాస్, హోంజీ, విజయలక్ష్మి, మహిపాల్ గోపి ఉన్నారు.

జీవో 25ను సవరించాలి

పెద్దవంగర, న్యూస్‌టుడే: విద్యాశాఖ జారీచేసిన జీవో 25ను సవరించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం చిట్యాల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఆరుతులాల బంగారం అపహరణ


పరిశీలిస్తున్న ఎస్సై సతీశ్

కురవి, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆదునుగా చూసి తాళం పగల గొట్టి చోరీకి పాల్పడిన సంఘటన కురవి మండలం బలపాల గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కురవి ఎస్సై సతీశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పిట్టల మోహన్‌రావు వ్యవసాయ భూమిలో నర్సరీ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా తల్లిని ఇంటి వద్ద ఉంచి భార్య స్వరూపతో పాటు రాత్రి సమయంలో నర్సరీ వద్దకు వెళుతున్నారు. రోజు మాదిరిగా నర్సరీ వద్దకు వెళ్లారు. అతని తల్లి పుల్లమ్మ కూడా ఆ రోజు ఊరికి వెళ్లారు. దానిని అదునుగా చూసిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగల గొట్టి బీరువాలో ఉన్న దుస్తులను కింద వేశారు. గురువారం ఉదయం ఇంటికి రాగానే ఇంటి తాళం పగలకొట్టి కనిపించింది. బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న ఆరు తులాల బంగారం, 26 తులాల వెండి అభరణాలు, నగదు రూ.25 వేలు ఎత్తుకెళ్లారు. మరో లాకర్‌లో ఉంచిన నగదు. రూ.4 లక్షలు కనిపించకపోవడంతో వదిలేశారు. వేలి ముద్రలు పడుతాయనే గుర్తించిన దొంగలు పగల గొట్టిన తాళం బుర్రను కూడా ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న కురవి పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందాన్ని రప్పించి వేలి ముద్రలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కేసముద్రం, న్యూస్‌టుడే: సైకిల్‌పై వెళ్తుండగా కింద పడటంతో తలకు తీవ్ర గాయమై ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం కేసముద్రం(వి) గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. కేసముద్రం(వి) గ్రామానికి చెందిన పుచ్చకాయల సంపత్‌రెడ్డి(33) మద్యం మత్తులో సైకిల్‌పై వెళ్తుండగా కేసముద్రం(వి) గ్రామంలోని ఆర్వోబీ సమీపంలో రోడ్డు పక్కన పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో 108లో ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు..

మరిపెడ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై మేతకు వెళ్లిన గొర్రెలు మృతి చెందిన సంఘటన మరిపెడ మండలం గాలివారిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . రైతు రాజుల వెంకటేశ్ గొర్రెలను మేతకు తీసుకెళ్తుండగా గ్రామ శివారులో ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకోగానే 11 కేవీ విద్యుత్తు తీగ తెగిపడింది. పది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. సుమారు రూ.1.5లక్షల విలువైన గొర్రెలు మృత్యువాత పడ్డాయని వెంకటేశ్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

హత్యాయత్నం కేసు నమోదు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. జమాండ్లపల్లి గ్రామానికి చెందిన పోలెపంగు ఎల్లయ్య తన అన్న కుమారుడిపై దాడికి పాల్పడి గాయపర్చాడు. తీవ్ర గాయాలైన బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పనులను అడ్డుకున్న గిరిజనులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లోని సబ్ జైలు సమీపంలో హోంగార్డుల ఇళ్ల కేటాయించిన స్థలాన్ని చదును చేస్తున్న క్రమంలో బాబునాయక్ తండా గిరిజనులు ఈ భూమి మాది చదును చేయొద్దంటూ అడ్డగించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని అడ్డుకున్న ఎనిమిది మంది గిరిజనులను అదుపులోకి తీసుకొని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. సాయంత్రం వరకు అక్కడే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా పశువుల సంత..



పై చిత్రంలో కనిపిస్తున్న ప్రాంతం డంపింగ్‌యార్డు అనుకుంటే పొరపాటే.. తొర్రూరు పశువుల సంత. మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు సమస్య ఉండటంతో పట్టణంలో సేకరించిన చెత్తను మహబూబాబాద్ వెళ్లే రోడ్డులోని సంతలో ఇలా కుప్పలు తెప్పలుగా పోస్తున్నారు. ఇరవై రోజులుగా ఇలానే డంప్ చేయడంతో పందులు, కుక్కలు, కోతులు సంచరిస్తూ పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. దుర్వాసన వ్యాపిస్తుండటంతో అంగడికి వచ్చే వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పురపాలికకు ఈ 'చెత్త' సమస్య ఎప్పుడు తీరుతుందో చూడాలి.. – తొర్రూరు, న్యూస్‌టుడే

తల్లడిల్లిన తల్లివానరం



సీతంపేట శివారులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఓ కోతిపిల్ల మృతి చెందింది. తల్లి వానరం వెనకనే వెళ్తున్న కోతి రోడ్డును దాటుతున్న క్రమంలో ఓ వాహనం ఢీ కొట్టి అక్కడికక్కడే మరణించింది. జరిగిన ఈ సంఘటనతో తల్లికోతి తల్లడిల్లింది. తల్లివానరం సహా వెంట ఉన్న కోతులు రోడ్డుపైనే వానర కళేబరం వద్ద దాదాపుగా గంటపాటుగా అక్కడే ఉన్న తీరు పలువుర్ని కలతకు గురిచేసింది.

– న్యూస్‌టుడే, గార్ల (మహబూబాబాద్)